'మార్వాడీ గో బ్యాక్'పై ఇంటలిజెన్స్ ఆరా

ఆందోళనల వెనుక రాజకీయ కోణముందా అని విచారణ

18న తలపెట్టిన బంద్ నిర్ణయం ఉప సంహారణ

7

గోకుల కృష్ణా.. గోపాల కృష్ణా..



షాబాద్ : సరస్వతీ శిశు మందిర్‌లో ఉట్టి కొడుతున్న విద్యార్థులు



శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను జిల్లా వ్యాప్తంగా శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా దేవాలయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణ, గోపిక వేషధారణలో అలరించారు. సాయంత్రం గ్రామాలలో యువకులు ఉట్లు కొట్టి సంబురాలు జరుపుకున్నారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్
ఆగస్టు 16

ఇబ్రహీంపట్నంలో..





కేశంపేట : రాధాకృష్ణుల వేషధారణలో ర్యాలీ

ఉప్పొంగిన ఈసీ.. పంటలు ఆగమాగం



దేవరంపల్లి గ్రామంలో ఈసీ వాగు ఉధృతికి పాడైన పత్తి పంట

చేవెళ్ల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చేవెళ్ల మండలంలోని దేవరంపల్లి గ్రామం వద్ద ఈసీ వాగు ఉప్పొంగి ప్రవహించింది. దీంతో గ్రామంలోని పంటలు దెబ్బతిన్నాయి. పత్తి, వరి, మొక్కజొన్నతోటు ఇతర కూరగాయాల పంటలు వరద ఉధృతికి కొట్టుకుపోయాయి. ఈ గ్రామంలోనే సుమారు 200 ఎకరాల్లో నష్టం వాటిల్లింది. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

ఉబికి వస్తున్న గంగమ్మ

ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తుండటంతో చేవెళ్ల మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన రైతు రవీందర్‌రెడ్డి పొలంలో ఉన్న బోరు నుంచి నీరు ఉబికి వస్తుంది. మోటర్ ఆన్ చేయకుండానే నీళ్లు రావడం చూసి రైతు ఆశ్చర్యపోయాడు.



మల్కాపూర్‌లో బోరు నుంచి పైకి వస్తున్న నీరు

తీరిన లోటు.. పెరిగిన సాగు

విస్తారంగా వర్షాలు.. ఊపందుకున్న వ్యవసాయం

ఉమ్మడి జిల్లాలో భారీగా కురుస్తున్న వర్షాలతో వానాకాలం సాగు కుదుటపడింది. అన్ని ప్రాంతాల్లో వ్యవసాయ పనులు జోరుగా సాగుతున్నాయి. అలాగే పలు పంటల సాగు అనూహ్యంగా పెరిగింది. రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో సగటుకు మించి వర్షపాతం నమోదైంది. వికారాబాద్‌లో 81శాతం, రంగారెడ్డిలో 72శాతం, మేడ్చల్‌లో 65 శాతం చొప్పున రైతులు పంటలు సాగు చేశారు. కాగా, వికారాబాద్‌లో పత్తి, రంగారెడ్డిలో మొక్కజొన్న రికార్డు స్థాయిలో సాగు చేశారు.

- మూడు జిల్లాల్లో సగటుకు మించి వర్షపాతం
- వికారాబాద్‌లో జిల్లాలో రికార్డు స్థాయిలో 2.5 లక్షల ఎకరాల్లో పత్తి సాగు
- రంగారెడ్డి జిల్లాలో సగటుకు మించి మొక్కజొన్న..
- హర్షం వ్యక్తం చేస్తున్నరైతులు

అధిక వర్షపాతం వివరాలు

జిల్లా	అధికం(శాతం)
రంగారెడ్డి	61
వికారాబాద్	33
మేడ్చల్	23

పంటల సాగు

జిల్లా	శాతం
రంగారెడ్డి	72
వికారాబాద్	81
మేడ్చల్	65



చౌదరిగూడ : వనంపల్లి శివారులో ఏపుగా పెరిగిన మొక్కజొన్న

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): ఉమ్మడి జిల్లాలో గడిచిన మూడు వారాలుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్న సంగతి తెలిసిందే. రంగారెడ్డి జిల్లాలో సగటుకు మించి 62 శాతం అధిక వర్షాలు కురిశాయి. అలాగే వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో కూడా సగటు మించి వర్షాలు పడ్డాయి. ఈ కారణంగా పలు పంటల సాగు గణనీయంగా పెరిగింది. గత జులై 15వ తేదీ వరకు మూడు జిల్లాల్లో భారీగా లోటు వర్షపాతం నమోదు కావడంతో రైతులు ఆందోళన చెందారు. రైతులు విత్తనాలు, ఎరువులు సిద్ధం చేసుకున్నప్పటికీ వర్షాలు లేకపోవడంతో పనులు ముందుకు సాగలేదు. గడిచిన ఆరేళ్లలోనే కనిష్ట వర్షపాతం నమోద ్కావడంతో రైతులంతా ఈ వానాకాలం

మిగతా 7వ పేజీలో...





యాచారం : వరి నాట్లు వేస్తున్న కూలీలు

వర్షపాతం జిల్లాల వారీగా (మి.మీలలో)

జిల్లా	కురువాల్సింది	కురిసింది
రంగారెడ్డి	318	516
వికారాబాద్	390	515
మేడ్చల్	357	440

టీబీ ముక్త్ భారత్‌కు బాధ్యతగా కృషి చేయాలి

రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

అనంతగిరిలో 3వ తెలంగాణ క్షయ, ఛాతీవ్యాధుల సదస్సు



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, స్పీకర్ ప్రసాద్‌కుమార్

వికారాబాద్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): టీబీ ముక్త్ (క్షయ) భారత్ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పిలుపునిచ్చారు. వికారాబాద్ జిల్లా, అనంతగిరిలోని హరిత రిసార్ట్‌లో రెండు రోజుల పాటు కొనసాగనున్న 3వ తెలంగాణ క్షయ వ్యాధులు, ఛాతీవ్యాధుల సదస్సు (టీజీటీసీవీఎన్-2025) ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పురాతన కాలంలో క్షయ వ్యాధి నివారణకు మందులు అందుబాటులో లేవని, ప్రస్తుతం చాలా రకాల మందులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. సబ్‌కా ప్రయాస్ సబ్‌కా వికాస్ అని.. క్షయ వ్యాధి నివారణలో అందరూ కష్టపడితేనే ఆరోగ్యంగా ఉంటారన్నారు. క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమాల్లో రాజకీయ నాయకులు, కవులు, కళాకారులు, అవార్డు గ్రహీతలను భాగస్వామ్యం చేస్తూ క్షయ వ్యాధి నిర్మూలనపై ప్రజలకు

మిగతా 7వ పేజీలో...

జాతీయ జెండా వివాదంపై విచారణ

» కలెక్టర్ ఆదేశాలతో రంగంలోకి చేవెళ్ల ఆర్డీవో

మొయినాబాద్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి) స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని వార్డు కార్యాలయాల వద్ద జాతీయ జెండా ఎగురవేసే విషయంలో కమిషనర్ ఖాజా మొయిజుద్దీన్ వ్యవహరించిన తీరుపై కలెక్టర్ నారాయణ రెడ్డి స్పందించారు. దీనిపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని చేవెళ్ల ఆర్డీవో చంద్రకళ, మొయినాబాద్ తహసీల్దార్ గౌతం కుమార్‌ను ఆదేశించారు. దీంతో వారు శనివారం విచారణ చేపట్టారు. కొత్తగా ఏర్పడిన శంకర్‌పల్లి, చేవెళ్లలో మున్సిపల్ కార్యాలయాలలోనే జాతీయజెండా ఎగురవేశారు. ఆయా మున్సిపల్ పరిధిలోని వార్డు కార్యాలయాల్లో జెండా ఎగురవేసే విషయంలో అక్కడి కమిషనర్లు ప్రజలతో సమయస్ఫూర్తితో మాట్లాడి సమస్యలేకుండా చూశారు. అయితే మొయినాబాద్ మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయిజుద్దీన్ మాత్రం ఇక్కడి వార్డు కార్యాలయాల్లో జెండా ఎగురవేయాలని అడిగితే దురుసుగా ప్రవర్తించారు. దీని కారణంగా వివాదం తలెత్తినట్లు విచారణలో అధికారులు గుర్తించారు. ఇదే విషయాన్ని కలెక్టర్‌కు నివేదించినట్లు సమాచారం. తదుపరి చర్యలు ఏవిధంగా ఉంటాయోననేది చర్చనీయాంశంగా మారింది.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



ముడిమ్యాల్ గ్రామంలో బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి సీతక్క, ప్రభుత్వ చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే యాదయ్య

- చేవెళ్లలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం
- హాజరైన మంత్రి సీతక్క, ప్రభుత్వ చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఇందిరమ్మ ప్రజాపాలన సాగుతుందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. శనివారం రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండల పరిధిలోని ముడిమ్యాల్ గ్రామం నుంచి మల్కాపూర్ వరకు రూ.3.35 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన, చేవెళ్లలో రూ. కోటి 30 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రభుత్వ చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే యాదయ్యతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధిని జోడుఎద్దుల మాదిరిగా పరుగులు పెడుతున్నాయన్నారు. పంచాయతీరాజ్ శాఖ

మిగతా 8వ పేజీలో...

కనులపండువగా కాటమయ్య బోనాలు

కడ్తాల్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): కడ్తాల్ మండల కేంద్రంలో శనివారం గౌడ సంఘం ఆధ్వర్యంలో కాటమయ్య బోనాలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ నేపథ్యంలో కంఠమహేశ్వర స్వామి దేవాలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం మహిళలు పట్టు వస్త్రాలు ధరించి బోనం కుండలతో ర్యాలీగా ఆలయానికి చేరుకున్నారు. స్వామి వారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. నాలుగు రోజుల పాటు కొనసాగే గ్రామ దేవతల బోనాల నేపథ్యంలో పోచమ్మ ఆలయ కమిటీచైర్మన్ సత్యం యాదవ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



బోనాల ఊరేగింపులో పోతురాజుల విన్యాసాలు

వర్షాకాలం.. వ్యాపిస్తున్న విష జ్వరాలు

● పెరుగుతున్న సీజనల్ వ్యాధుల పీడితులు



మేడ్చల్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ముసురు వర్షాలు కురుస్తున్నాయి. గుంతలు, మురుగు కాల్వల్లో, రహదారుల పక్కన నిలిచే నీరు దోమలకు ఆవాసంగా మారుతున్నాయి. ఈగలు,దోమలకు తోడు వర్షాకాలంలో సహజంగా వచ్చే జలుబు, విష జ్వరాలు జడలు విప్పుతున్నాయి. వానాకాలంలో గాలిలో తేమశాతం ఎక్కువ. ఇది బ్యాక్టీరియా, వైరస్‌లు, ఫంగస్, దోమలు వృద్ధికి అనువైన కాలం. మనుషుల రోగ నిరోధక శక్తి బలహీనపడుతుంది. ఇప్పటికే ఆస్పత్రులు జ్వరాలు, డెంగీ వంటి వారితో నిండుతున్నాయి.

రోగాల లక్షణాలు ..

వర్షాకాలంలో డెంగీ, మలేరియా, చికెన్ గున్యా, ఉదర ఇన్ఫెక్షన్లు, లెప్టోస్పిరోసిస్, కలరా, టైఫాయిడ్, వైరల్ ఫీవర్, అతిసార, ఇన్‌ఫ్లుయెంజ వంటి జబ్బులు సోకుతాయి. వీటివల్ల దీర్ఘకాలిక జ్వరం, దద్దుర్లు, తలనొప్పి, ప్లేట్లెట్ తగ్గడం, సున్నితత్వం, వాపులు, అలసట, చలి, కీళ్లనొప్పి, వొళ్లు నొప్పులు, చెమట పట్టడం, తీవ్ర రక్తహీనత, లోబీపీ, కండరాల తిమ్మిర్లు, దాహం వేయడం, చర్మం పాలిపోవటం, హృదయ స్పందన రేటు పెరుగుదల, బలహీనత, వాంతులు, మలబద్ధకం, ఫారింక్స్ వాపు, లూస్ మోషన్స్, వికారం, మలంలో రక్తం, ముక్కు దిబ్బడ, గొంతు మంట, నిరంతర దగ్గు, కళ్లు ఎరుపు వంటి లక్షణాలు కనిపిస్తాయి.

వ్యాధులకు కారణాలనేకం ...

వర్షాకాలంలో అత్యంత సాధారణ వ్యాధి డెంగీ, మంచినీటి నిల్వలో వృద్ధిచెందే టైగర్ దోమ కారణంగా వ్యాపిస్తుంది. వీటిలో పులి ఏడెస్ అల్బోపిక్టస్ వల్ల చికున్‌గున్యా వస్తుంది. సహజంగా వానాకాలంలో పరిసరాల్లో నీటి నిల్వలుంటాయి. దోమకాటు వల్ల మలేరియా ప్రబలుతుంది. కలుషితాహారం, నీటి కారణంగా వివిధ వ్యాధులు సోకుతాయి. వాటిల్లో టైఫాయిడ్ ఒకటి. సాధారణ ఆరోగ్య సమస్యల్లో ఒకటైన అతిసార సైతం వీటి కారణంగా వస్తుంది. రోగం ముదిరితే ప్రాణాపాయానికి దారితీస్తుంది. మరోవైపు కడుపు ఇన్ఫెక్షన్లకు అపరిశుభ్ర ఆహారం, బయటి పదార్థాలు, కలుషిత ద్రవపదార్థాలు కారణం.గ్యాస్ట్రోఎంటెరిటిస్ అనేది ఈ సీజన్‌లో వచ్చే ఇన్ఫెక్షన్. వైరల్ జ్వరం ఏడాది పొడవునా వస్తున్నా వర్షాకాలంలో ఎక్కువ ప్రబలుతుంది. వాతావరణ మార్పులు, ఉష్ణోగ్రతల హెచ్చుతగ్గులతో ఇన్‌ఫ్లుయెంజా సోకుతుంది. వైరల్ ఇన్ఫెక్షన్లు ఒకరి నుంచి మరొకరికి సోకే ప్రమాదముంది. వృద్ధులు, అస్తమా బాధితులు, పిల్లల్లో ఊపిరితిత్తుల సమస్య తలెత్తుతున్నాయి. అసాధారణ బ్యాక్టీరియాతో లెప్టోస్పిరోసిస్ వ్యాధి వస్తుంది. ఇది జంతువుల నుంచి మానవులకు సోకుతుంది. శరీరంపై గాయాలు, కోతలున్నట్లయితే బయటకు వెళ్లేప్పుడు వాటిని కప్పి ఉంచుకోవాలి. ఏ వైరల్ ఫీవర్ సోకినా రోగి శరీరంలో ప్లేట్‌లెట్లు తగ్గుతాయి. వెంటనే ఆస్పత్రిలో చేరి చికిత్స పొందాలి.

జాగ్రత్తలు తీసుకోవాలి



వర్షాకాలంలో కీటక, నీటిజనిత వ్యాధులు ఎక్కువ సంభవిస్తాయి. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత తప్పక పాటించాలి. దోమల వృద్ధిని అరికట్టాలి. ఇళ్లలో దోమ తెరలు, లేపనాలు వాడాలి. నీటి గుంతల్లో కిరోసిన్ చల్లాలి. పరిసరాల్లో మురుగునీరు నిలవకుండా చూసుకోవాలి. కలుషిత ఆహారం, నీరు తీసుకోకూడదు. రోగ నిరోధకశక్తిని పెంచే ఆహారం భుజించాలి. వేడి చేసి చల్లార్చిన నీరే తాగాలి. చల్లటి పదార్థాలు తినొద్దు.

- ఉమాగౌరి, జిల్లా వైద్యాధికారి



దుస్తులు అందజేస్తున్న నిఖిల కన్‌స్ట్రక్షన్స్ ఎండీ శ్రీనివాసరావు

పేదలకు దుస్తులు అందజేసిన నిఖిల కన్‌స్ట్రక్షన్స్ ఎండీ

శంకర్‌పల్లి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పేదలకు సహాయం చేయాలని వివంటా గ్రీన్ మిడోస్, నిఖిల కన్‌స్ట్రక్షన్స్ ఎండీ శ్రీనివాసరావు అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని చందిప్పలో పేదలకు దుస్తులను అందజేసి, అన్నదానం నిర్వహించారు. నిఖిల కన్‌స్ట్రక్షన్స్ సేవా కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. కార్యక్రమంలో సురేష్, సిబ్బంది తదతరులు ఉన్నారు.

బెట్టింగ్‌లు, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

● క్రీడా పోటీల ప్రారంభోత్సవంలో బూడిద రాంరెడ్డి



క్రీడాకారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న రాంరెడ్డి తదితరులు

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్, డ్రగ్స్‌కు యువత, విద్యార్థులు దూరంగా ఉండాలని బీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బూడిద రాంరెడ్డి అన్నారు. వ్యసనాలకు దూరంగా ఉంటూ యువత భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బీఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు జరుగనున్న వాలీబాల్, ఖోఖో, కబడ్డీ క్రీడాపోటీలను శనివారం మండల పరిధి ఉప్పరిగూడ క్రాస్ రోడ్డులో ఆయన ప్రారంభించారు. నియోజకవర్గంలోని 44 ప్రభుత్వ పాఠశాలల నుంచి వెయ్యి మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొంటున్నారు. విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ.. యువతకు డ్రగ్స్ పెనుభూతంలా మారాయన్నారు. తల్లిదండ్రులు ఎన్నో ఆశలతో పిల్లలకు చదువులకు పంపిస్తున్నారని, వారి కలలను సాకారం చేయాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. పోటీ ప్రపంచంలో నెగ్గాలంటే చదువులతోపాటు నైపుణ్యాన్ని పెంచుకోవాలన్నారు. అప్పుడే లక్ష్యాన్ని ఛేదించగలుగుతామన్నారు. డ్రగ్స్, చెడు వ్యసనాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. క్రీడా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు స్పోర్ట్స్ జెర్సీ, కిట్లు, ఫైల్స్ అందజేశారు. కార్యక్రమంలో ఎస్సై సూర్యతేజ, నాయకులు నర్సింహారెడ్డి, పలు పాఠశాల ప్రధానోపాధ్యాయులు గిరిధర్, శ్రీనివాసులు, సుధాకర్, ఫిజికల్ డైరెక్టర్లు సుశీల, రాజు, పుణ్యశ్రీ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



వాలీబాల్ ఆడుతున్న బాలికలు


ఏకాంబర రామలింగేశ్వరాలయం

నేటి నుంచి నీళ్లపల్లి ఏకాంబరేశ్వరుడి జాతర

బషీరాబాద్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): కొండకోనల మధ్య ఆటవీ ప్రాంతంలో సప్తగుండాల మధ్య వెలసిన నీళ్లపల్లి ఏకాంబర రామలింగేశ్వరస్వామి ఆలయం 28వ వార్షికోత్సవాలకు ముస్తాబైంది. ఆదివారం నుంచి మంగళవారం వరకు ఉత్సవాలు నిర్వహిస్తారు. 17న పల్లకి సేవ, గంధాలు, 18న జాతర, సాయంత్రం రథోత్సవం, 19న జాతర ముగింపు కార్యక్రమాలు ఉంటాయి. జాతరకు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పి.శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఈ చారిత్రక ఆలయంలో ఏటా శ్రావణమాస ఆఖరు ఆది, సోమ, మంగళవారాలు జాతర నిర్వహిస్తారు. భక్తులు మొదల సప్తగుండాల్లో స్నానమాచరించి ఆలయంలో శివయ్యను దర్శించుకుంటారు. ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్, మెదక్ జిల్లాలతో పాటు కర్ణాటకలోని సమీప ప్రాంతాల భక్తులు తరలి వస్తారు. ఈ ఆలయం పక్కనే ఉన్న పుష్కరిణిలో శ్రీరాముడి పరమభక్తుడైన యాకుబ్‌సాబ్ సజీవసమాధి మతసమైక్యతకు చిహ్నంగా భాసిల్లుతోంది. జాతరలో హిందూ, ముస్లింలు, ఇతర మతస్తులు పాల్గొంటారు. తాండూరు డీఎస్పీ బాలక్రిష్ణరెడ్డి, రూరల్ సీఐ నగేశ్ నేతృత్వంలో బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్ఐ నుమాన్‌అలీ తెలిపారు. ఈ జాతరకు తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి, పలువురు రాజకీయ నాయకులు, అధికారులు హాజరవుతారని ఆలయ కమిటీ చైర్మన్ తెలిపారు. భక్తుల కోసం విశాల ఏర్పాట్లు చేశామని చెప్పారు.

గ్యాస్ పైప్‌లైన్ లీక్



మేడ్చల్ టౌన్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మేడ్చల్-కిష్టపూర్ రోడ్డు పక్కన స్తంభాలు పాతేందుకు శనివారం జరిపిన తవ్వకాల్లో భాగ్యనగర్ భూగర్భ గ్యాస్ పైప్‌లైన్ ధ్వంసమై గ్యాస్ లీకైంది. దీంతో పరిసర ప్రాంత ప్రజలు పరుగులు తీశారు. గ్యాస్ పైప్‌లైన్ పగిలిన విషయం గ్యాస్ కంపెనీకి సమాచారం ఇచ్చారు. కంపెనీ వారు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని పగిలిన పైప్‌నకు మరమ్మతు చేశారు. గ్యాస్ పైప్‌లైన్ పగిలి రెండుగంటల పాటు మేడ్చల్‌లో గ్యాస్ పరఫరా నిలిచింది. స్థానికులు వెంటనే అప్రమత్తం కావటంతో పెను ముప్పు తప్పింది.



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ఓటు చోరీ సిగ్గుచేటు

శంకర్‌పల్లి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ ఓట్ల చోరీకి పాల్పడటం సిగ్గు చేటని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. కాంగ్రెస్ చేపట్టిన 'ఓట్ చోర్-ఘడీ చోర్' కార్యక్రమంలో భాగంగా శంకర్‌పల్లిలో శనివారం రాత్రి నియోజకవర్గ ఇన్‌చార్జి భీమ్‌భరత్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు చోరీతో అధికారంలోకి రావడం సిగ్గుచేటన్నారు. అంబేడ్కర్ రాజ్యాంగాన్ని బీజేపీ, జాతీయ ఎన్నికల కమిషన్ కాలరాయడం అన్యాయం అన్నారు. ఆధార్ నంబర్‌తో ఓటరు పేరును లింక్ చేయాలని డిమాండ్ చేశారు. చేవెళ్ల పార్లమెంటరీ పార్టీ ఇన్‌చార్జి బొంతు రామ్మోహన్ మాట్లాడుతూ... ఓటుహక్కును కాపాడుకునేందుకు ప్రజలంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి భీమ్‌భరత్ మాట్లాడుతూ.. దొంగ ఓట్లను గుర్తించి అధికారులకు ఫిర్యాదు చేయాలని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర, జిల్లా నాయకులు శివసేనారెడ్డి, అనితారెడ్డి, గౌరీ సతీష్, జ్యోతి, పారిజాత, జ్ఞానేశ్వర్, కిషన్‌గుప్తా, వేణు, జనార్ధన్‌రెడ్డి, రవీందర్ రెడ్డి. శ్రీనాథ్‌గౌడ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.


జైత్వారంలో పథకాలపై వివరిస్తున్న కృష్ణాగౌడ్

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కందుకూరు, ఆగస్టు16(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాష్ట్ర కిసాన్ మోర్చా నాయకులు పల్లె కృష్ణాగౌడ్ కోరారు. శనివారం బీజేపీ మండల అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి ఆధ్వర్యంలో జైత్వారంలో నిర్వహించిన 'సంపర్క్ అభియాన్'లో భాగంగా ఇంటింటికి కేంద్ర పథకాలపై వివరించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలు ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపునకు కృషిచేయాలని శ్రేణులకు సూచించారు. బక్క మల్లేష్, రఘునంధన్, చంద్రారెడ్డి, కుమ్మరి నర్సింహ, నవీన్, మధు, నరేందర్, ఆంజనేయులు, పాండు, రేవంత్ పాల్గొన్నారు.

మహనీయుడు.. కొర్వి కృష్ణస్వామి

కందుకూరు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగరాభివృద్ధికి మాస్టర్ ప్లాన్ అందించిన మహనీయుడు కొర్వి కృష్ణస్వామి అని ముదిరాజ్ సంఘం మండల శాఖ అధ్యక్షుడు పిట్టల పాండు, గౌరవాధ్యక్షుడు కాకి రాములు అన్నారు. శనివారం కృష్ణస్వామి జయంతి వేడుకలను మండల కేంద్రంలోని హైదరాబాద్-శ్రీశైలం రహదారిపై నిర్వహించారు. కృష్ణస్వామి చిత్రపటానికి నివాళులర్పించారు. సంఘం నాయకులు సురేందర్, పి.లింగం, పి.ఆంజనేయులు, ఉదయ్‌కిరణ్, సుదర్శన్, పర్వతాలు, వెంకటేశ్, నర్సింహ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కోనాపూర్ రోడ్డు విస్తరణకు శ్రీకారం

» రెండు లేన్ల రోడ్డుకు రూ.45కోట్లు మంజూరు


రోడ్డు విస్తరణకు మార్కింగ్ చేస్తున్న సిబ్బంది

ఆమనగల్లు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): కోనాపూర్ రోడ్డుకు మహర్దశ వచ్చింది. హైదరాబాద్-శ్రీశైలం రహదారి కోనాపూర్ గేట్ నుంచి ఆకుతోటపల్లి, దొడ్లపహాడ్, అప్పారెడ్డిపల్లిల మీదుగా మాడ్గుల వరకు 21కిలో మీటర్ల బీటీ రోడ్డు వైడెనింగ్‌కు ప్రభుత్వం నిధలు మంజూరు చేసింది. ఆర్అండ్‌బీ శాఖకు రూ.45కోట్లు కేటాయించింది. జూలై 11న మాడ్గులలో రోడ్డు విస్తరణ పనులకు మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దామోదర్ రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి శంకుస్థాపన చేశారు. పనుల ప్రారంభానికి శనివారం కోనాపూర్ వద్ద రోడ్డు సర్వే, మార్కింగ్ చేపట్టారు. రోడ్డు పనులు కానుండడంతో ఆమనగల్లు, మాడ్గుల మండలాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

టీబీ ముక్త్ భారత్‌కు బాధ్యతగా కృషి చేయాలి

(ఐదో పేజీ తరువాయి)

అవగాహన కల్పించాలని చెప్పారు. క్షయ వ్యాధి నిర్మూలనలో వికారాబాద్ జిల్లాను ఆదర్శంగా నిలపాలని, ఇతర జిల్లాలకు, రాష్ట్రానికి, దేశానికి జిల్లాను రోల్ మోడల్‌గా తీర్చిదిద్దడానికి ప్రణాళిక రూపొందించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ సందర్భంగా అనంతగిరి కా హవా.. లాకో మరీజోంకా దవా.. అన్న నానుడిని గుర్తు చేసిన గవర్నర్ అనంతగిరిలోని మూలికలు, గాలి, వాతావరణం క్షయ వ్యాధి నివారణలో కీలక పాత్ర పోషించిన విషయాన్ని సదస్సు దృష్టికి తీసుకువచ్చారు.

సకాలంలో చికిత్స తీసుకోవాలి

శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ క్షయకు సకాలంలో చికిత్స తీసుకుంటే వ్యాధి నుంచి త్వరగా కోలుకోవచ్చని చెప్పారు. క్షయ, ఛాతీ వ్యాధుల గురించి ప్రజలకు సరైన అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా క్షయ వ్యాధి నివారణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వివిధ జిల్లాల అధికారులు డాక్టర్ మల్లికార్జున్ (మహబూబ్‌నగర్), డాక్టర్ రాజు (జోగులాంబ గద్వాల), డాక్టర్ సుమలత (ఆదిలాబాద్), డాక్టర్ పుల్లారెడ్డిలకు బంగారు పతకాలు, జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిషోర్, జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణ రెడ్డి, ట్యూబర్ క్యూలోసిస్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ చైర్మన్ డాక్టర్ సుధీర్ ప్రసాద్, డాక్టర్లు దీనదయాళ్‌బాగ్, నరేందర్, బాలచందర్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించి స్వాగతం పలికారు.


క్షయ నివారణకు ఉత్తమ సేవలు అందించిన వైద్యాధికారికి బంగారు పతకం, జ్ఞాపిక బహూకరిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

తీరిన లోటు.. పెరిగిన సాగు



(ఐదో పేజీ తరువాయి)

సీజన్‌లో 80శాతమైన సాగు పూర్తవుతుందా? అనే అనుమానాలు తలెత్తాయి. అయితే గడిచిన మూడు వారాలుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో లోటు తీరి వ్యవసాయం గాడిన పడింది. వాతావరణ అనుకూల పరిస్థితుల కారణంగా మూడు జిల్లాల్లో గడిచిన మూడు వారాలుగా పంటలు సాగు గణనీయంగా పెరిగింది. వికారాబాద్ జిల్లాలో ఈ సీజన్‌లో 5,94,902 ఎకరాల్లో పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. అయితే జిల్లాలో ఇప్పటి వరకు 81 శాతం పూర్తయింది. రంగారెడ్డి జిల్లాలో 3,85,011 ఎకరాల్లో పంటలు సాగవుతాయని అంచనా వేయగా ఇప్పటి వరకు 72 శాతం పూర్తయింది. అలాగే మేడ్చల్ జిల్లాలో 23,430 ఎకరాల్లో పంటలు వేయాలని లక్ష్యంగా నిర్ణయించగా ఇప్పటి వరకు 65 శాతం రైతులు పంటలు వేశారు.

రికార్డుస్థాయిలో పత్తి, మొక్కజొన్న

విస్తారంగా వర్షాలు కురడంతో మూడు జిల్లాల్లో పత్తి, మొక్కజొన్న, కంది పంటలు సాగు బేష్‌గా ఉంది. వికారాబాద్ జిల్లాలో రికార్డు స్థాయిలో పత్తి సాగు పెరిగింది. ఈ ఏడాది జిల్లాలో పత్తి పంటను 2.44 లక్షల ఎకరాల్లో సాగు చేయాలని లక్ష్యంగా నిర్ణయించగా ఇప్పటికే అంతకు మించి రైతులు 2.49 లక్షల ఎకరాల్లో పంట వేశారు. అలాగే రంగారెడ్డి జిల్లాలో మొకజొన్న విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. ఈ సీజన్‌లో మొక్కజొన్న 56వేల ఎకరాల్లో సాగవుతుందని అంచనా వేయగా ఇప్పటికి దాదాపు 64వేల ఎకరాల్లో రైతులు సాగు చేశారు. రంగారెడ్డి జిల్లాలో ఈ సీజన్‌లో 1.62లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేయాలని లక్ష్యంగా నిర్ణయించగా ఇప్పటి వరకు 1.38 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. వికారాబాద్ జిల్లాలో కంది పంట 1.47లక్షల ఎకరాల్లో సాగు చేయాలని లక్ష్యంగా నిర్ణయించగా ఇప్పటి వరకు 1.05 లక్షల ఎకరాల్లో కంది పంట వేశారు. అయితే వరి సాగు ఇంకా పెరగలేదు. ఇంకా భారీ వర్షాలు పడుతుండడంతో వరి నాట్లపై ప్రభావం పడుతోంది. దీంతో వరి నాట్లు ఆశించిన స్థాయిలో జరగడం లేదు. వికారాబాద్‌లో వరి పంటసాగు 60 శాతానికిపైగా పూర్తికాగా రంగారెడ్డి జిల్లాలో 50శాతం కూడా నాట్లు వేయలేదు.

జూలై, ఆగస్టులో భారీగా..

గత జూన్‌నెలలో మేడ్చల్ జిల్లాలో 75శాతం లోటు వర్షపాతం నమోదు కాగా, వికారాబాద్ జిల్లాలో 44శాతం , రంగారెడ్డి జిల్లాలో 25శాతం సగటు కంటే తక్కువ వర్షం కురిసింది. అయితే జులై, ఆగస్టు నెలల్లో వర్షాలు భారీగా పడ్డాయి. దీంతో మూడు జిల్లాల్లో వానాకాలం సగటు వర్షపాతం కంటే అధిక వర్షపాతం నమోదైంది. రంగారెడ్డి జిల్లాలో ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 318మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా ఇప్పటి వరకు 516 మి.మీ వర్షం కురిసింది. వికారాబాద్ జిల్లాలో 390మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 515మి.మీ వర్షం కురిసింది. మేడ్చల్ జిల్లాలో 357మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 440మి.మీ వర్షం కురిసింది. ఈ మూడు జిల్లాల్లో జూలైలో సగటుకు మించి వర్షం కురవగా ఆగస్టు నెలలో కూడా ఇప్పటికే సగటుకు మించి వర్షపాతం నమోదైంది.

హామీ మేరకు పెన్షన్లను పెంచాలి

» లేకుంటే ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకుంటాం

» పోరాటాల్లో వెనకబడిన కమ్యూనిస్టులు

» ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ



సమావేశంలో మాట్లాడుతన్న మందకృష్ణ మాదిగ

తాండూరు/పరిగి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పింఛన్లను వెంటనే పెంచాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. శనివారం దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో తాండూరు పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు పదవులు ఇస్తామని చాలా పార్టీల నుంచి ఆఫర్లు వచ్చాయని ఆ ఆఫర్లకు లొంగకుండా, ఎమ్మార్పీఎస్ లక్ష్యం దెబ్బతినకుండా ముందుకు సాగుతున్నామన్నారు. గతంలో భూ పోరాటలు చేసిన వామపక్షాలు, ప్రస్తుతం వెనుకబడి పోయాయన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చి 20 నెలలు అయినా అమలు చేయడం లేదన్నారు. పొరుగున ఉన్న చంద్రబాబు ప్రభుత్వం తక్షణమే అమలు చేసిందని గుర్తు చేశారు. పింఛన్ల పెంపు విషయంపై ప్రభుత్వంతో తాడోపేడో తెల్చుకుంటామని ఇందులో భాగంగా సెప్టెంబర్ 3న హైదరాబాద్‌లో మహాగర్జన సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో ప్రతిపక్షాలు పోషించని పాత్రను ఎమ్మార్పీఎస్ పోషిస్తుందన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు కొడగంటి మల్లికార్జున్, సూర్య ప్రకాశ్, దివ్యాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షులు చంద్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్లు పెంచకుంటే గద్దె దించుతాం

దివ్యాంగుల పెన్షన్లు పెంచుతావా? గద్దె తిగుతావా... అంటూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. త్వరలో నిర్వహించనున్న మహాగర్జనకు సంబంధించి శనివారం పరిగిలో నిర్వహించిన సన్నహాక సమావేశంలో ఆయన మాట్లాడారు. పెన్షన్లు పెంచకపోతే, కేసీఆర్‌ను ఎలా గద్దె దించామో...? సీఎం కుర్చీ నుంచి రేవంత్‌ను కూడా దించుతామని స్పష్టం చేశారు. సమావేశంలో దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు ఊరడి శ్యాంప్రసాద్, సంఘం నాయకులు మంజులారెడ్డి, నస్కంటి సురేశ్, వినోద్, ఆనందం, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రజారంజక పాలన


లబ్దిదారుకు ఎల్వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజారంజకంగా పాలన సాగిస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజలకు భద్రత, భరోసా ఏర్పడిందని తెలిపారు. ఆమనగల్లు, కడ్తాల మండలాల్లో శనివారం ఎమ్మెల్యే పర్యటించి అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పనులు నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. పేదలకు మంజూరైన చెక్కులను, ఎల్వోసీలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు ఇస్తామని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు కల్లు రమణా రెడ్డి, వెంకటేశ్, శ్రీనివాస్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, జగన్, వెంకటేశ్వర్లు, శంకర్, రవి, దశరథ్ రెడ్డి, కొండల్‌రెడ్డి, తాళ్ల రవీందర్, సాయిరెడ్డి పాల్గొన్నారు.

గౌడ భవన నిర్మాణానికి నిధులు కేటాయించండి

ఆమనగల్లులోని కాటమయ్యగుట్టపై గౌడసంక్షేమ భవనం నిర్మాణానికి నిధులు కేటాయించాలని సంఘం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం ఇచ్చారు. సర్దార్ సర్వాయిపాపన్న గౌడ్ విగ్రహం పక్కన గౌడ సంక్షేమ భవనం నిర్మాణానికి ప్రభుత్వం నుంచి రూ.కోటి మంజూరు చేయించాలని కోరారు. అలాగే ఆదివారం ఆమనగల్లులో నిర్వహించే కాటమయ్య బోనాలకు రావాలని ఎమ్మెల్యేకు ఆహ్వానాన్ని అందజేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సంఘం అధ్యక్షుడు చుక్కా అల్లాజిగౌడ్, పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, యాచారం వెంకటేశ్వర్లుగౌడ్, గంగ రవీందర్‌గౌడ్, దూసకంటి యాదయ్య గౌడ్, నిరంజన్‌గౌడ్, జగన్‌గౌడ్ ఉన్నారు.

ప్రజారోగ్యానికి... మొబైల్ హెల్త్ క్యాంపులు

» నేడు మేడిగడ్డలో ప్రారంభం

» ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి


మాట్లాడుతున్న రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): కల్వకుర్తి నియోజకవర్గ ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా ఐక్యతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొబైల్ హెల్త్ క్యాంప్‌లు నిర్వహిస్తోందని ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. ఆమనగల్లులోని ఫౌండేషన్ కార్యాలయంలో శనివారం రాఘవేందర్‌రెడ్డి మాట్లాడారు. మేడిగడ్డ తండాలో ఆదివారం మొబైల్ వైద్య క్లినిక్‌లు ప్రారంభిస్తామని తెలిపారు. బస్సుతో ప్రతీ గ్రామంలో ఇంటింటికి తిరిగి ప్రతీ వ్యక్తి గుండె, లివర్, కిడ్నీ, మధుమేహ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. సకాలంలో వైద్య పరీక్షలతో ఏమైనా వ్యాధి ఉంటే గుర్తించి వెంటనే చికిత్స చేయించుకుంటే ప్రజలకు మేలు కలుగుతుందన్నారు. ప్రతీ వారం ఓ గ్రామంలో మొబైల్ క్లినిక్ నిర్వహిస్తామన్నారు. 2028 సంవత్సరం వరకు ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తామన్నారు. ఐక్యతా ఫౌండేషన్ వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో చెంచు సంఘం రాష్ట్ర నాయకుడు మండ్లి రాములు, ఫౌండేషన్ సభ్యులు రచ్చ శ్రీరాములు, అభినవ్‌రెడ్డి, మల్లేశ్, కొండల్ పాల్గొన్నారు.

'మార్వాడీ గో బ్యాక్'పై ఇంటలిజెన్స్ ఆరా

ఆమనగల్లు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మార్వాడీ వ్యాపారులు వెనక్కు వెళ్లాలంటూ.. 'మార్వాడీ గో బ్యాక్' పేరిట ఈ నెల 18న ఆమనగల్లు బంద్‌కు పిలుపిచ్చిన నేపథ్యంపై ఇంటలిజెన్స్ అధికారులు ఆరా తీస్తున్నారు. స్థానిక కిరాణా, వర్తక, వస్త్ర, బంగారం వ్యాపారులు మార్వాడీ వ్యాపారులకు వ్యతిరేకంగా నిరసనలకు సిద్ధమవుతున్నారు. గత శుక్రవారం కరపత్రాలు ముద్రించి దుకాణల్లో పంచారు. సోషల్ మీడియాలో వైరల్ చేశారు. ఈ అంశం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. 'మార్వాడి గో బ్యాక్' ఆందోళనల వెనుక ఏ రాజకీయ పార్టీ అయినా ఉందా? దీన్ని ఎవరు లేవనెత్తారు? అనే కోణంలో ఇంటలిజెన్స్ ఆరా తీస్తోంది. శనివారం ఆమనగల్లులో కొందరు నిఘా అధికారులు వివరాలు సేకరించినట్లు తెలిసింది. ఆమనగల్లు ప్రాంతం లో మార్వాడీ వ్యాపారులు ఎంత మంది, ఏం వ్యాపారాలు చేస్తున్నారు? స్థానిక వ్యాపారులకు వస్తున్న ఇబ్బందులేమిటీ? అనే వివరాలు సేకరించినట్టు తెలిసింది. మార్వాడి దుకాణాలతో స్థానికులకు ఉపాధి లభిస్తోందా? అనే దానిపైనా ఆరా తీసినట్టు తెలిసింది. కాగా మార్వాడీలు నాసిరకం వస్తువులను అమ్ముతున్నారని స్థానిక వ్యాపారుల పేరిట ముద్రించిన కరపత్రంలో పేర్కొన్నారు. రేపటి బంద్‌పిలుపు నేపథ్యంలో నిఘా అధికారులు అన్ని వర్గాల నుంచి సమాచారాన్ని సేకరించి ప్రభుత్వానికి అందజేస్తున్నారు.

బంద్ నిర్ణయం ఉప సంహరణ

ఆమనగల్లులో ఈ నెల 18న తలపెట్టిన బంద్‌ను స్థానిక వ్యాపారులు విరమించుకున్నారు. ఈ మేరకు శనివారం రాత్రి వారు ఓ ప్రకటన విడుదల చేశారు. కాగా పోలీసుల సూచనలతో బంద్‌ను వాయిదా వేసినట్లు సమాచారం. మార్వాడి వ్యాపారులతో జరిపిన చర్చలు సఫలమై ఈ నిర్ణయాన్ని తీసుకున్నట్లు స్థానిక వ్యాపారులు సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు.

సౌదీలో దేశభక్తిని చాటిన పరిగి వాసి



పరిగి,ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): సౌదీ అరేబియాలో పరిగి వాసి దేశభక్తిని చాటాడు. పరిగికి చెందిన ఇసాక్‌అలీ సౌదీ వెళ్లాడు శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సౌదీలోని మదీనా షరీఫ్ వద్ద భారత జాతీయ జెండాను ప్రదర్శించాడు. ఆ ఫొటోలను స్నేహితులకు పంపాడు.

ప్రశాంతంగా పండుగలు జరుపుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రాజువర్మ

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ప్రశాంత వాతావరణంలో పండుగలు జరపాలని పోచారం ఐటీ కారిడార్ స్టేషన్ సీఐ రాజువర్మ తెలిపారు. శనివారం పీస్(శాంతి) కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వినాయక చవితి ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. ఎవరైనా అల్లర్లకు పాల్పడినా, కారకులైనా చర్యలు తప్పవని హెచ్చరించారు. వినాయక మండపాలకు అనుమతి తీసుకోవాలని, డీజేలు పెట్టొదని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐలు శివకృష్ణ, నాగేశ్వర్‌రావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు త్వరగా పూర్తిచేయాలి


మాట్లాడుతున్న తండా వాసులు

దుద్యాల, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ఈర్లపల్లి ప్రధాన రోడ్డు నుంచి సంద్రకుంట తండా వరకు చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేయాలని తండావాసులు కోరారు. కొన్ని నెలలుగా నిర్మాణ పనులు నిలవడంతో ఇబ్బందులు తప్పడం లేదన్నారు. వర్షాలకు మట్టి కొట్టుకుపోయి రాకపోకలకు అవస్థలు పడుతున్నామని వాపోయారు. అధికారులు స్పందించి రోడ్డు పనులను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

రూ.30కోట్లతో డబుల్ రోడ్డు పనులు


బషీరాబాద్‌లో చేపడుతున్న రోడ్డు విస్తరణ పనులు

బషీరాబాద్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి):బషీరాబాద్‌లోని రైల్వేగేటు నుంచి జీవన్గి బ్రిడ్జి మీదుగా కరణ్‌కోట్ వరకు చేపట్టే డబుల్ రోడ్డు పనులు శనివారం ప్రారంభమయ్యాయి. రోడ్డుకు రూ.30కోట్లు మంజూరయ్యాయి. మూడు నెలల కిందట కాంట్రాక్టర్ జీవన్గి వైపు నుంచి పనులు చేపట్టారు. మధ్యలో పనులు పడకేశాయి. మూడు రోజుల కిందట ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆర్అండ్‌బీ అధికారులతో సమీక్షించారు. కాంట్రాక్టర్‌తో చర్చించిన పనుల ప్రారంభానికి చర్యలు తీసుకోగా కాంట్రాక్టర్ పనులను మొదలుపెట్టారు. రైల్వే గేటు మలుపు నుంచి జీవన్గి రోడ్డు పోచమ్మ ఆలయం వరకు సీసీ డబుల్‌రోడ్డును నిర్మించనున్నారు.


పెద్ద చెరువు గండి వద్ద పూడ్చివేతకు చర్యలు చేపట్టిన అధికారులు

నవాంద్గీ చెరువుకు గండి పూడ్చివేత

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బషీరాబాద్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): నవాంద్గీ పెద్ద చెరువుకు పడిన గండిని నీటి పారుదల శాఖ అధికారులు శనివారం పూడ్చారు. ఇరిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రావణ్, సిబ్బంది చెరువు తూము గండిని ఇసుక బస్తాలతో తాత్కాలికంగా పూడ్చారు. 'నవాంద్గీ పెద్ద చెరువుకు గండి' శీర్షికన 11వ ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తకు ఇరిగేషన్ అధికారులు స్పందించి మండల అధికారులను అప్రమత్తం చేశారు. గండి శాశ్వత పనులకు నిధుల మంజూరుకు ప్రభుత్వానికి నివేదిక పంపించినట్లు వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రావణ్ తెలిపారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

● రాధాకృష్ణుల వేషధారణలో ఆకట్టుకున్న చిన్నారులు
● ఆలయాల్లో భక్తుల ప్రత్యేక పూజలు.. అభిషేకాలు


చౌదరిగూడ : చిన్నికృష్ణుడి వేషధారణలో బాలుడు

ఆమనగల్లు/చౌదరిగూడ/షాబాద్/షాద్‌నగర్ అర్బన్/కొత్తూర్/కేశంపేట/చేవెళ్ల/యాచారం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి మండల కేంద్రాలతోపాటు ఆయా మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఆలయల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు గ్రామాలలో గోపికలు, చిన్ని కృష్ణుని వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు. ఆమనగల్లు పట్టణంలోని వేంకటేశ్వరాలయంలో అర్చకుడు కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో డోలారోహణం నిర్వహించారు. సంఘ సేవకుడు పాపిశెట్టి రాము శ్వేత దంపతులు పాల్గొన్నారు. కడ్తాల మండలం ధనరాశి పర్వతంపై గల శ్రీ రాధాకృష్ణ ఆలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. అలాగే జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉట్టికొట్టి సంబురాలు జరుపుకున్నారు. షాబాద్ మండలంలో నాగర్‌గూడ శ్రీకృష్ణ దేవాలయంలో, పలు పాఠశాలల్లో కృష్ణాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. నాగర్‌గూడ శ్రీ కృష్ణ మందిరం చైర్మన్ తాళ్ల శ్రీనివాస్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు. కొత్తూర్ మున్సిపాలిటీతో పాటు, మండలంలోని గ్రామాల్లో వేడుకలు జరుపుకున్నారు. కొత్తూర్‌లో స్వాధ్యాయ పరివార్ ఆధ్వర్యంలో శ్రీఆంజనేయస్వామి ఆలయంలో భగవంతుని పారాయణాలు నిర్వహించి, ఉట్లు కొట్టే కార్యక్రమం నిర్వహించారు. చిన్నారుల కృష్ణుడు, రాధా, గోపిక వేషధారణలతో పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. కేశంపేట మండలంలో వేడుకలు జరుపుకున్నారు. కొత్తపేట, ఎక్లాస్‌ఖాన్‌పేట ఆర్‌వీ పాఠశాలల విద్యార్థులు శ్రీకృష్ణ, గోపిక వేషధారణతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. గ్రామాలలో యువకులు ఉట్లు కొట్టి సంబురాలు జరుపుకున్నారు. మాజీ జడ్పీటీసీ విశాల శ్రవణ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వై.రవీందర్ యాదవ్, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మండలాధ్యక్షులు గూడ వీరేశ్, ఎస్.మురళీధర్ రెడ్డి, రాధికలు ప్రజలకు కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. ఆర్వీ రవీందర్, కొట్టపల్లి రవీందర్, రాధిక, టీచర్లు పాల్గొన్నారు. చేవెళ్ల మండలంలోని అన్ని గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలను శ్రీ కృష్ణుడు, సత్యభామ వేషధారణలో తయారు చేశారు. గ్రామాల్లోని దేవాలయాల్లో భక్తులు కృష్ణుడిని స్మరిస్తూ భజనలు, కీర్తనలు చేశారు. భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణభగవానుని సేవిస్తే కష్టాలు తొలగుతాయని ఇస్కాన్ ప్రచార సంస్థ సభ్యులు దేవేందర్‌దాస్‌గుప్త అన్నారు. యాచారం మండలం మాల్‌లో ఇంటర్‌నేషనల్ సొసైటీ ఫర్ కృష్ణకాన్షియస్‌నెస్ సంస్థ ఆధ్వర్యంలో వేడుకలు జరిపారు. శ్రీకృష్ణుడి విగ్రహానికి అభిషేకం చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భజనలు కీర్తనలు, నృత్యప్రదర్శనలు, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. పీఆర్‌జీ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ రవీందర్‌గుప్త తదితరులు పాల్గొన్నారు.


యాచారం : మాల్‌లో భక్తుల పూజలు


షాద్‌నగర్ అర్బన్ : శ్రీకృష్ణ, గోపిక వేషధారణ పోటీలలో చిన్నారులు


ఆమనగల్లు : డోలారోహణంలో భక్తులు

పిల్లలను ధర్మరక్షకులుగా పెంచండి

షాబాద్/షాద్‌నగర్ అర్బన్ : చదువు, ఉద్యోగం, సంపాదననే లక్ష్యం కాకుండా సమాజహితం కోరి పిల్లలను ధర్మరక్షణ కోసం పెంచాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, బాలగోకుల సమితి చైర్మన్ నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి పిలుపునిచ్చారు. శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని శనివారం బాలగోకుల సమితి ఆధ్వర్యంలో స్థానిక మా కన్వెన్షన్ హాలులో శ్రీకృష్ణ, గోపిక వేషధారణ పోటీలను నిర్వహించారు. చిన్నారి బాలబాలికలు పోటీపడి బహుమతులు అందుకున్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య, డాక్టర్ చందులాల్ రాథోడ్, డాక్టర్ అనురాగ్‌రెడ్డి, సంస్కార భారత్ నాయకుడు టీవీ రంగయ్య, బాలగోకుల సమితి సభ్యురాలు స్వాతిరెడ్డి, బీజేపీ నాయకులు వెంకటేష్‌గుప్త, ఎం.మురళి, వంశీకృష్ణ, అశోక్, విజయ్, కురుమయ్య, చెట్ల వెంకటేష్, ఋషికేష్, హరిభూషణ్ తదితరులున్నారు.


షాబాద్ : నాదర్‌గూడ శ్రీకృష్ణ మందిరంలో పూజలు

వాజ్‌పేయికి ఘన నివాళి


చేవెళ్ల : నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

ఆమనగల్లు/శంకర్‌పల్లి/చేవెళ్ల, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతిని ఆమనగల్లు పట్టణంలో శనివారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ మున్సిపాలిటీ, మండల్యాక్షులు విక్రమ్‌రెడ్డి, ఎర్రవోలు శ్రీనుల ఆధ్వర్యంలో వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. పలు చోట్ల మొక్కలు నాటారు. సేవా కార్యక్రమాలు నిర్వహించారు. బీజేపీ జిల్లా, మండల నాయకులు గోరటి నర్సింహ, దుర్గా ప్రసాద్, దండు శ్రీను, చెక్కాల లక్ష్మణ్, రాంభూపాల్ రెడ్డి, కృష్ణగౌడ్, శేఖర్ రెడ్డి, విష్ణుచారి, శ్రీశైలం యాదవ్, కృష్ణయాదవ్, తదితరులు పాల్గొన్నారు. వాజ్‌పేయి సేవలు మరువలేనివని బీజేపీ శంకర్‌పల్లి మండల అధ్యక్షురాలు లీలావతి ఘనానంద్ అన్నారు. మోకిలలో వాజ్‌పేయి చిత్రపటానికి పలువురు నాయకులతో కలిసి నివాళులర్పించారు. శంకర్‌పల్లి మున్సిపల్ అధ్యక్షుడు దయాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పించారు. రాములుగౌడ్, తొండరవి, వెంకటయ్య, వాసుదేవ్, ప్రతాప్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, సింహం రాజు, పండిత్‌రావు, రాజ్‌కుమార్, జయరాంరెడ్డి తదితరులు ఉన్నారు. వాజ్‌పేయి సేవలు చిరస్మరణీయమని బీజేపీ చేవెళ్ల మండలాధ్యక్షుడు అత్తెల్లి అనంతరెడ్డి తెలిపారు. చేవెళ్ల మండల కేంద్రంలో వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పించారు. సీనియర్ నాయకులు కుంచం శ్రీనివాస్, శంకర్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, అశోక్, సత్యనారాయణ, జయసింహారెడ్డి, సీహెచ్ శ్రీనివాస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


శంకర్‌పల్లి : మోకిలలో నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

(ఐదో పేజీ తరువాయి)

ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లాలో 1583 పనులకుగాను రూ.571 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. ఇందులో ఇప్పటి వరకు 1176 పనులు పూర్తిచేసి రూ. 132 కోట్లను విడుదల చేశామన్నారు. చేవెళ్ల డివిజన్‌లో తొమ్మిది పనులకు రూ.25.10 కోట్లు మంజూరయ్యాయని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగానే ఇన్ని పనులు పెండింగ్‌లో ఉన్నాయని ఆరోపించారు. ఎమ్మెల్యే యాదయ్య అభివృద్ధి కోసం బీఆర్ఎస్ వైపు వెళ్లి ఏమీ సాధించుకోలేకపోయారన్నారు. మళ్లీ పుట్టింటి (కాంగ్రెస్) ద్వారా అనేక అభివృద్ధి పనులు చేసే అవకాశం కలిగిందన్నారు. గ్రామాల్లో రోడ్లు, అంగన్‌వాడీ, పంచాయతీ భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తున్నామన్నారు. ఇంకా అక్కడక్కడ మిగిలిన గ్రామీణ రోడ్లకు, బ్రిడ్జిలకు నిధులు త్వరలో ఇస్తామన్నారు. అనంతరం చేవెళ్ల మండలం తంగడ్‌పల్లి గ్రామంలో నిర్వహించిన అభయాంజనేయ స్వామివారి విగ్రహ ప్రతిష్ఠాపన పూజా కార్యక్రమంలో సీతక్క, మహేందర్‌రెడ్డి, కాలె యాదయ్య పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, రాష్ట్ర పొల్యూషన్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి, డీపీవో చంద్రమోహన్, జెడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, చేవెళ్ల ఆర్డీవో చంద్రకళ, చేవెళ్ల తహసీల్దార్ బి. కృష్ణయ్య, ఎంపీడీవో హిమబిందు, ఎంపీవో విఠలేశ్వర్, చేవెళ్ల, ముడిమ్యాల్ పీఏసీఎస్ చైర్మన్‌లు దేవర వెంకట్‌రెడ్డి, గోనే కరుణాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ రాములు, డైరెక్టర్లు పాండుయాదవ్, లక్ష్మారెడ్డి, జనార్దన్, చేవెళ్ల మండల మహిళ అధ్యక్షురాలు దేవర సమతారెడ్డి, ప్రధాన కార్యదర్శి గోనె సరితారెడ్డి, తదితరులు ఉన్నారు.

చేసేదే చెబుతా.. చెప్పింది చేస్తా

● షాద్‌నగర్ టౌన్‌లో నిర్వహించిన బస్తీబాటలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
● దసరా లోపు సమస్యలన్నింటినీ పరిష్కరిస్తానని హామీ


మహిళల నుంచి వినతి పత్రాలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): నేను చేసేదే చెబుతాను.. చెప్పింది చేస్తాను.. మాట మరువను.. మడమ తిప్పను.. మీ సమస్యలను రాతపూర్వకంగా రాసివ్వండి.. ఎంతటి సమస్య అయినా.. దసరాలోపు పరిష్కరించే బాధ్యత నాదంటూ షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం షాద్‌నగర్ టౌన్‌లో కాలినడకన కాలనీలలో బస్తీ బాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కాలనీలలో ఉన్న మహిళలు పెద్దఎత్తున తరలివచ్చి సమస్యల ఏకరువు పెట్టారు. ఎమ్మెల్యే స్పందిస్తూ ఇలా కాకుండా మీ సమస్యలన్నింటినీ ఒక కాగితంపై రాసివ్వండి.. దసరా పండుగ లోపు సమస్యలను నెరవేర్చే బాధ్యత తనదని హామీ ఇచ్చారు. అనంతరం ఇటీవల పట్టణంలోని భాగ్యనగర్ కాలనీలో నిర్వహించిన బస్తీబాటలో వచ్చిన విద్యుత్ సమస్యను పరిష్కరించి ఆ కాలనీలో ఏర్పాటు చేసిన నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం శంకర్ మాట్లాడుతూ షాద్‌నగర్ మున్సిపల్ అభివృద్ధికి త్వరలోనే పెద్దఎత్తున నిధులు మంజూరు కానున్నాయని తెలిపారు. ఆ నిధులతో ప్రతీ వార్డులో మౌలిక సదుపాయాలు కల్పించేలా పట్టణ ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్‌చైర్మన్ బాబర్‌ఖాన్, పట్టణ అధ్యక్షుడు కొంకళ్ల చెన్నయ్య, పార్టీ సీనియర్ నేతలు అగ్గనూరు బస్వం, చెంది తిరుపతిరెడ్డి, సులోచనా కృష్ణారెడ్డి, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్.. పేదలకు వరం


చెక్కును అందజేస్తున్న నాయకులు

ఆమనగల్లు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరంగా నిలుస్తుందని నాయకులు అన్నారు. పోతెపల్లికి చెందిన అశ్వినికి రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో మంజూరైన రూ.25,500 సీఎంఆర్ఎఫ్ చెక్కును శనివారం ఆమనగల్లు పట్టణంలో జీఎస్ఆర్ యువసేన నాయకులు బాధిత కుటుంబానికి అందజేశారు. నాయకులు కొండల్ యాదవ్, శ్రీనివాస్, సైదయ్య, కొండల్, మార్కండేయ, శోభన్, తిరుపతయ్య, శేఖర్, భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలి

ఆమనగల్లు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలంతా పోలీసులకు సహకరించాలని ఎస్ఐ బి.వెంకటేశ్ కోరారు. ఆమనగల్లు పోలీసుస్టేషన్‌లో శనివారం రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమనగల్లు పట్టణంలోని లక్ష్మీ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి నిర్వాహకురాలు డాక్టర్ ఎస్.శారద నాలుగు బారికేడ్లను సమకూర్చి ఎస్ఐ వెంకటేశ్‌కు అందజేశారు.

రేపు ఉచిత కంటి వైద్యశిబిరం

ఆమనగల్లు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఈనెల 18న ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్‌క్లబ్ పీఆర్‌వో ఎంఏ పాష తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో ఆమనగల్లు లయన్స్‌క్లబ్, ఎనుగొండ రాంరెడ్డి లయన్స్ కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రైవేటు టీచర్ల సేవలను గుర్తించాలి

ఆమనగల్లు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయుల సేవలను ప్రభుత్వం గుర్తించాలని ఆమనగల్లు ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గుర్తించే ఉత్తమ టీచర్లలో ప్రైవేట్ ఉపాధ్యాయుల సేవలను కూడా పరిగణలోకి తీసుకోవాలని కోరారు. ఆమనగల్లు పట్టణంలో శనివారం ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ సభ్యులతో కలిసి కృష్ణ విలేఖరులతో మాట్లాడుతూ ప్రైవేట్ టీచర్ల సేవలను గుర్తించి ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ పురస్కారాలు అందించాలని కోరారు. ఉపాధ్యక్షుడు నరేశ్, ప్రధాన కార్యదర్శి నరేందర్, కోశాధికారి నజీర్, శ్రీను, టీచర్లు పాల్గొన్నారు.

'భగీరథ' నీరు రాక ప్రజల ఇబ్బందులు

చౌదరిగూడ, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మిషన్ భగీరథ వాటర్ నిలిచి పోవడంతో తీవ్రఇబ్బందులు పడుతున్నారని బీఆర్ఎస్ కార్మిక విభాగం మండలాధ్యక్షుడు నర్సింహులు అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ చేగిరెడ్డి ఘణాపూర్‌లో సింగిల్ ఫేజ్ మోటార్లు కాలిపోయినా మరమ్మతులు చేయక పోవడంతో ఎస్సీ కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పది రోజులుగా మిషన్ భగీరథ నీటి సరాఫరా నిలిచిపోవడంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

కందుకూరు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఆ పార్టీ నాయకులు బొక్క సంజీవరెడ్డి, సౌడపు శేఖర్‌గౌడ్, ఎండీ ఖదీర్, కుమ్మరి కృష్ణయ్యలు అన్నారు. శనివారం కొత్తగూడలో ఏర్పాటు చేయడానికి మంజూరైన వీధి దీపాలను వారు ఏర్పాటు చేశారు. కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి(కేఎల్లార్) చొరవతో జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు కొత్తగూడకు రూ.9లక్షల విలువగల 77 ఎల్‌ఈడీ లైట్లను మంజూరు చేసినట్లు తెలిపారు. గ్రామంలో అవసరం ఉన్న ప్రాంతాల్లో రోడ్లు, అండర్‌డ్రైనేజీ ఏర్పాటుకు నిధుల మంజూరుకు కేఎల్లార్‌కు నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు. నాయకులు బొక్క హన్మంత్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, కుమ్మరి అంజయ్య, సౌడపు శంకర్‌గౌడ్, బొక్క దామోదర్‌రెడ్డి, బొక్క రాజశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

తలకొండపల్లి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): చౌదర్‌పల్లికి చెందిన జంగయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. శనివారం మృతదేహాన్ని డీసీసీ ఉపాధ్యక్షుడు భగవాన్‌రెడ్డి సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి రూ.2500 ఆర్థికసాయం అందజేశారు.

దైవభక్తి కలిగి ఉండాలి : మల్‌రెడ్డి


యాచారం : పూజల్లో ఎమ్మెల్యే మల్‌రెడ్డి

యాచారం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ప్రతీవ్యక్తి దైవభక్తి కలిగి ఉండాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డిరంగారెడ్డి అన్నారు. శనివారం యాచారం మండలం గడ్డమల్లాయగూడలోని పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో కొత్తగా ఆలయం నిర్మించడంతో ఆయన సందర్శించారు. అమ్మవారికి ఆలయం నిర్మించి బోనాలు సమర్పించడం అభినందనీయమన్నారు. నియోజకవర్గ ప్రజలంతా సుఖశాంతులతో ఉండేలా దీవించమని అమ్మవారిని వేడుకున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. బీఎస్‌రెడ్డి ట్రస్ట్‌చైర్మన్ బిలకంటి చంద్రశేఖర్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఏఎంసీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ అచ్చన జంగయ్య, కాంగ్రెస్ నాయకులు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ కె.శ్రీనివాస్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ మహిపాల్, నాయకులు ఎం.వెంకటరెడ్డి, అరవింద్‌నాయక్ తదితరులున్నారు.

వేంకటేశ్వరుడి సన్నిధిలో యజ్ఞం

షాద్‌నగర్ అర్బన్ : పెద్దజానంపేట శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తిశ్రద్ధలతో యజ్ఞం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహాకుంభప్రోక్షణ, పవిత్రోత్సవాలలో భాగంగా రెండోరోజు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన పూజారి శ్రీనివాసాచార్యుల నేతృత్వంలో వేదపండితులు యాగశాలప్రవేశం, అఖండ దీపారాధన, అగ్నిమథనం, ధ్వజకుంభారాధన, మూర్తి కుంభారాధన, అగ్నిప్రతిష్ఠ, ఉపకుంభారాధన, మూలమంత్ర హవనాలు. శ్రీ విష్ణుపారాయణం, నిత్య పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ అభివృద్ధి పర్యవేక్షకులు పలబట్ల బాల్‌రాజ్‌గుప్త, పరిగి వెంకటసాయిశ్వర్‌రెడ్డి, లింగారం కుమార్‌గౌడ్, కొత్త రాజు, ఎం. సాయికృష్ణ, ఒగ్గు కిషోర్, తదితరులున్నారు.

దాతలకు దండిగా ఆశీస్సులు

సంపాదనలో కొంత ధనాన్ని లోకకల్యాణం కోసం దైవకార్యాలకు వినియోగించే దాతలకు కలియుగ దైవమైన వేంకటేశ్వర స్వామి ఆశీస్సులు దండిగా ఉంటాయని మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు అన్నారు. పెద్ద జానంపేట శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి బాలానగర్ మాజీ జడ్పీటీసీ సభ్యుడు మంచిరేవుల సాయికృష్ణ రూ.లక్ష విరాళంగా ఇచ్చారు. ఆలయం ప్రాగణంలో బక్కని సమక్షంలో చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా సాయికృష్ణ ఆయన కుమారుడు రాజశేఖర్‌లను సన్మానించి, ఆశీర్వదించారు.


షాద్‌నగర్ అర్బన్ : వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన యజ్ఞంలో భక్తులు

గౌడ సంఘం ఆధ్వర్యంలో పూజలు

కడ్తాల్ : గౌడ కులస్తుల సంక్షేమం, ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ అన్నారు. మండల కేంద్రంలోని కాటమయ్య దేవాలయంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గౌడ కులస్తుల బోనాల పండగకు శ్రీనివాస్ రెడ్డి రూ.10వేలు విరాళం అందించారు. ఉత్సవ నిర్వాహకులు ఈ సందర్భంగా ఆయనను సత్కరించి అభినందించారు. మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, నాయకులు మల్లేశ్‌గౌడ్, రమేశ్‌గౌడ్, శివగౌడ్, కేశవులుగౌడ్, శ్రీరాములుగౌడ్, గణేశ్ గౌడ్, వెంకటయ్యగౌడ్, రాజేందర్‌గౌడ్, బిక్షపతి, సత్యం, రాంచంద్ర, లాయక్ అలీ, రాంచందర్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

వీరాంజనేయ బ్రహ్మోత్సవాలు

తలకొండపల్లి : రామకృష్ణాపురంలో బురుజుగడ్డ వీరాంజనేయస్వామి ఆలయంలో శనివారం వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. పీఏసీఎస్ చైర్మన్ కేశవరెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు కాసు శ్రీనివాస్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు హోమం, అభిషేకాలు, ప్రత్యేక పూజలు కొనసాగాయి. పీఏసీఎస్ డైరెక్టర్ శ్యామ్‌సుందర్ రెడ్డి, దేవుని పడకల్‌మాజీ సర్పంచ్ కాడేమోని శ్రీశైలం, నాయకులు రాజశేఖర్ రెడ్డి, అమర్‌నాథ్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, కోటి రెడ్డి, నారాయణ రెడ్డి, ఆలయ అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.


తలకొండపల్లి : పూజల్లో భక్తులు

క్రైం కార్నర్

గంజాయి సరఫరా.. నలుగురి అరెస్టు

తలకొండపల్లి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): గంజాయి సరఫరా చేస్తున్న నలుగురు నిందితులను తలకొండపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 287 గ్రాముల గంజాయి, ఒక షిఫ్ట్ కారు, స్కూటీ, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఆమనగల్లు సీఐ వి.జానకిరామ్‌రెడ్డి తలకొండపల్లి పోలీసు స్టేషన్‌లో శనివారం విలేఖరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. తలకొండపల్లి ఎక్స్ రోడ్డు వద్ద ఎస్ఐ శేఖర్ పోలీసు సిబ్బందితో శుక్రవారం సాయంత్రం వాహనాలు తనిఖీ చేస్తున్నారు. కడ్తాల వైపు నుంచి తలకొండపల్లికి వస్తున్న షిఫ్ట్ కారును ఆపే ప్రయత్నం చేయగా అందులో ఉన్న ఇద్దరు వ్యక్తులు కారు వదిలేసి పారిపోతుండగా పోలీసులు పట్టుకొని తనిఖీ చేయగా గంజాయి కన్పించింది. కారులో ఉన్న తలకొండపల్లికి చెందిన పద్మ వెంకటేశ్, కట్టమల్ల రఘువర్ధన్‌లను విచారించగా నగరంలోని ఉప్పల్‌కు చెందిన జోగు రాజు, పిల్లి ప్రణయ్‌ల నుంచి గంజాయి తీసుకువస్తున్నట్లు తెలిపారు. నలుగురిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. ఈమేరకు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ జానకిరామ్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

● నేత్రదానం చేసిన తల్లిదండ్రులు


శివ(ఫైల్)

కడ్తాల్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. కడ్తాల మండలం కడ్తాల-చల్లంపల్లి రోడ్డులో ఈసంఘటన చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. కడ్తాల మండల కేంద్రానికి చెందిన మారెమోని రవి-మంజుల కుమారుడు శివ (21) శుక్రవారం మైసిగండి దేవాలయం వద్ద బంధువుల విందుకు వెళ్లాడు. అనంతరం తలకొండపల్లిలోని బంధువుల ఇంటికి బైక్‌పై బయలుదేరాడు. కడ్తాల-చల్లంపల్లి రోడ్డులో వంపుగూడ వద్ద బైక్ అదుపుతప్పి శివ కింద పడటంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు ఉస్మానియాకు తరలించగా చికిత్సపొందుతూ మృతి చెందినట్లు సీఐ గంగాధర్ తెలిపారు. మృతుడి తండ్రి రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. కాగా, శివ మృతిపై కుటుంబసభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా కుమారుడి నేత్రాలు దానం చేసి మానవత్వం చాటుకున్నారు ఆ తల్లిదండ్రులు. మంజుల-రవి దంపతులకు వారి కుమారుడు శివ నేత్రదానంపై పలువురు అవగాహన కల్పించారు. తల్లిదండ్రుల అంగీకారంతో హైదరాబాద్‌లోని ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి కళ్లు దానం చేశారు.

తెగిపడిన 11 కేవీ విద్యుత్ వైర్లు

● తప్పిన పెను ప్రమాదం.. సరిచేసిన అధికారులు

శంషాబాద్ రూరల్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్ద తూప్రాన్ వద్ద చెరువులో 11 కేవీ విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పెద్ద తూప్రాన్ చెరువులోకి వరద నీరు భారీగా చేరింది. విషయం తెలుసుకున్న విద్యుత్ అధికారులు శనివారం బోటు సహాయంతో చెరువులోకి వెళ్లి 11 కేవీ విద్యుత్ తీగలను పునరుద్ధరించారు. విద్యుత్ అధికారుల చొరవకు స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కాగా, ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని వారు తెలిపారు. పెను ప్రమాదం తప్పిందని అధికారులు ఈ సందర్భంగా తెలియజేశారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

కేశంపేట, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామ పంచాయతీ వాల్యాతండాకు చెందిన మూడవత్ శారద-లక్ష్మణ్ దంపతుల కుమారుడు మూడవత్ శ్రీనివాస్(21) అదృశ్యమైనట్లు కేశంపేట సీఐ నరహరి తెలిపారు. శారద, లక్ష్మణ్‌లు శుక్రవారం వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్లి, మధ్యాహ్న సమయంలో భోజనానికి ఇంటికి వచ్చారు. ఇంట్లో కుమారుడు లేకపోవడంతో చుట్టుపక్కల ఇళ్లల్లో వెతికారు. బంధువుల ఇళ్లలో ఉన్నడేమోనని ఆరా తీశారు. అయినా ఆచూకీ దొరకలేదు. దాంతో శనివారం శారద ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా, శ్రీనివాస్ ఇంట్లో నుంచి వెళ్లే సమయంలో బ్లూ కలర్ జీన్స్ ప్యాంటు, తెలుపు రంగు షర్టు ధరించి ఉన్నాడని, తెలుపు వర్ణంతో 5.8 ఫీట్ల ఎత్తు ఉంటాడని సీఐ తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

● ఇద్దరికి తీవ్ర గాయాలు

యాచారం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డ ఘటన యాచారం పోలీస్ స్టేషన్ పరిధి తమ్మలోనిగూడ గేట్ వద్ద శనివారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మాల్ వైపు నుంచి ఇబ్రహీంపట్నం వెళుతున్న ఆర్టీసీ బస్సు ముందు వెళుతున్న పల్సర్ బైక్‌ను ఢీకొట్టడంతో బైక్ నడుపుతున్న వర్త్యా నెహ్రూ, వెనక కూర్చున్న శశిధర్‌లు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను పెట్రోమొబైల్-2 పోలీసులు ఇబ్రహీంపట్నం ఆస్పత్రికి తరలించారు. అనంతరం బాధితుల వద్ద ఫోన్‌ల ఆధారంగా కుటుంబికులకు సమాచారం అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నందీశ్వర్ రెడ్డి తెలిపారు.

బీజేపీ నాయకులకు ఘన సన్మానం


గోరటి నర్సింహ, శ్రీను, నర్సింహ, లక్ష్మణ్, రాంభూపాల్ రెడ్డిలను సన్మానించిన నాయకులు

ఆమనగల్లు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లాస్థాయి పదవులు చేపట్టిన ఆమనగల్లు, మాడ్గుల మండలాలకు చెందిన నాయకులకు శనివారం అభినందన సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమనగల్లు ఆలేటి నారాయణ ఫంక్షన్‌హాల్‌లో బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు కర్నాటి విక్రమ్‌రెడ్డి, మండలాధ్యక్షుడు ఎర్రవోలు శ్రీనుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా గోరటి నర్సింహ, ఉపాధ్యక్షులుగా దండు శ్రీనివాస్, బోడ నర్సింహ, జిల్లా కార్యదర్శిగా రాంభూపాల్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా చెక్కాల లక్ష్మణ్‌లు నియమితులయ్యారు. బీజేపీ నాయకులు పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. సామాన్య కార్యకర్తకు సైతం బీజేపీలో గుర్తింపు ఉంటుందని వారు అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులంతా సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ హామీల అమలుపై ప్రజల పక్షాన పోరాటాలు సాగించాలని కోరారు. బీజేపీ జిల్లా, మండల నాయకులు దుర్గాప్రసాద్, కృష్ణగౌడ్, శేఖర్ రెడ్డి, కృష్ణయాదవ్, శ్రీశైలంయాదవ్, జంతుక జానయ్య, నరేశ్‌చారి, మల్లేశ్, పద్మ అనిల్, రవిరాథోడ్, సాయి, అశోక్, నరేందర్, సందీప్, బాలు, కృష్ణ భరత్ గౌడ్, రాజశేఖర్, ప్రవీణ్ రెడ్డి, నర్సింహ, వెంకటేశ్, గణేశ్, బాలు, లాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో నిత్యాన్నదానం


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సుధీర్

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చేవారి కోసం శ్రీ బాలాజీ కృప ట్రస్టు నిర్వాహకుడు గజరాజు సుధీర్ నిత్యాన్నదాన కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని మొగిలిగిద్ద గ్రామానికి చెందిన సుధీర్ పోలీస్ శాఖలో పనిచేస్తూ పేదల కోసం అన్నదానం చేయాలన్న ఆలోచనతో ప్రారంభించిన నిత్యాన్నదాన కార్యక్రమాన్ని రెండోరోజు శనివారం కొనసాగించారు. సోమవారం నుంచి శనివారం వరకు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు సుధీర్ తెలిపారు.